క్లుప్తంగా

పాఠశాలల సందర్శన



ధర్మవరం హైస్కూల్‌లో విద్యార్థులు ట్యాబ్‌లను వినియోగిస్తున్నదీ లేనిది పరిశీలిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, ధర్మవరంలో ఉన్నత పాఠశాలను డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి బుధవారం సందర్శించారు. బైజూస్ కంటెంట్‌తో ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులు వినియోగిస్తున్నదీ లేనిదీ, ఉపాధ్యాయుల బోధనతీరును సమీక్షించారు. సెల్ఫ్, లిప్ కార్యక్రమాల అమలుపై ఉపాధ్యాయులను ఆరా తీశారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం



విద్యార్థుల బ్యాగులు తనిఖీ చేస్తున్న ఎస్‌ఈబీ సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్‌ఐ సత్యనారాయణమూర్తి

చీపురుపల్లి: మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్ నాశనమవుతుందని ఎస్‌ఈబీ సీఐ ఉమామహేశ్వరరావు అన్నారు. పలు కళాశాలలు, వసతిగృహాలు, రీడింగ్ రూమ్‌లు వంటి ప్రదేశాల్లో బుధవారం నిఘా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వినియోగించినా, రవాణా చేసినా, కలిగి ఉన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో కళాశాలలు, వసతిగృహాల వద్ద అనుమానిత వ్యక్తులపై నిఘా పెంచుతున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎస్‌ఐ పి.సత్యనారాయణమూర్తి, సిబ్బంది ఉన్నారు.

జాగరంలో ఆంజనేయస్వామి తీర్థం



పరుగు పోటీల్లో దౌడు తీస్తున్న ఎద్దులు

జామి: మండలంలోని జాగరం గ్రామంలో ఆంజనేయస్వామి తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీల్లో 10 జతల ఎద్దులు పాల్గొన్నాయి. విజేతలకు గ్రామపెద్దలు నగదు బహుమతులు అందజేశారు.

వసతి గృహంలో తనిఖీలు

బొండపల్లి: స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో ఎంపీడీఓ ఏ.వేదవతి బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. పదోతరగతి విద్యార్థినులకు పబ్లిక్ పరీక్షలపై పలు సూచనలు చేశారు.

ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోండి

వేపాడ: పదేళ్ల క్రితం ఆధార్‌కార్డు పొందిన వారు తమ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ బి.ఎస్.ఎస్.కె.పట్నాయక్ కోరారు. వల్లంపూడి సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందాలంటే పదేళ్లు దాటిన ప్రతీ ఆధార్ కార్డును సదరు వ్యక్తులు అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉందన్నారు. అలాగే అయుష్మాన్‌భవ పథకానికి సంబంధించి 523 మందికి ఈకేవైసీ చేయాల్సిఉండగా 320 మందికి ఈకేవైసీ పూర్తయిందని చెప్పారు. వల్లంపూడి, సోంపురం సచివాలాయాల్లో ఆధార్ కేంద్రాలు నడుస్తున్నాయని, కుమ్మపల్లి, దబ్బిరాజుపేట, వావిలపాడు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉందన్నారు. అనంతరం వల్లంపూడి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు.

క్వారీల పరిశీలన

శృంగవరపుకోట: అక్రమ క్వారీయింగ్ చేస్తూ, అడ్డగోలు బ్లాస్టింగులతో తమని ఇబ్బందులు పెడుతున్నారంటూ ఇటీవల ఆలుగుబిల్లి గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ శ్రీనివాసరావు ఆలుగుబిల్లి రెవెన్యూ పరిధిలోని క్వారీలను గురువారం సందర్శించారు. మూడు క్వారీలకు సంబంధించిన రికార్డులు, క్వారీల నిర్వహణను పరిశీలించారు. రికార్డుల మేరకు అన్నీ సవ్యంగానే ఉన్నాయని, ఆయన వివరించారు. మిగిలిన క్వారీలను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా క్వారీయింగ్ చేసినా, అనుమతులు మించి మైనింగ్ చేసినా చర్యలకు సిఫార్సు చేస్తామని తెలిపారు.

నేత్ర వైద్యశిబిరం

కొత్తవలస: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక విశాఖ కళ్లద్దాల షాపు ఆవరణలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. 50 మందికి వైద్యసిబ్బంది కంటి పరీక్షలు చేసి 20 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు వీరికి ఉచితంగా ఆపరేషన్ నిర్వహించి, కళ్లద్దాలు, మందులు అందజేస్తామని శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

రూ.39 కోట్లతో రహదారి విస్తరణ

• వేపాడ– ఆనందపురం రోడ్డుకు మహర్దశ



బి.వి.పాలెంవద్ద ప్రారంభమైన తారుపూత పనులు



పనులను పరిశీలిస్తున్న ఆర్అండ్‌డీ డీఈఈ శ్రీనివాసరావు



వేపాడ సమీపంలో చేపడుతున్న విస్తరణ పనులు

వేపాడ: మండలంలోని వేపాడ – ఆనందపురం ప్రధాన రహదారికి మహర్దశ పట్టింది. అనకాపల్లి జిల్లా ఆనందపురం జంక్షన్ నుంచి విజయనగరం జిల్లా వేపాడ మండలంలోని సోంపురం వరకు జంక్షన్ వరకు సుమారు 16.8 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ పనులకు ఎన్‌డీబీ నిధులు రూ.39 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయించింది. ప్రస్తుతం 3.50 మీటర్ల వెడల్పు ఉన్న ఈ రోడ్డును 7 మీటర్ల వెడల్పు చేయనున్నారు. 16.8 కిలోమీటర్ల రోడ్డు పరిధిలో 54 పువు కల్వర్టులు, నాలుగు శ్లాబ్ కల్వర్టులు, రక్షణగోడలు నిర్మించాల్సి ఉంది. మండల కేంద్రానికి సమీపంలో బి.వి.పాలెం సమీపం నుంచి తారు వేసే పనులను బుధవారం ప్రారంభించారు. ఆర్అండ్‌బీ డీఈఈ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ రూ.39 కోట్ల ప్రతిపాదనలతో రోడ్డు విస్తరణ చేయనున్నామని చెప్పారు. ఇప్పటికే సుమారు 42 పైపు కల్వర్టుల నిర్మాణం పూర్తయినట్లు చెప్పారు. రోడ్డును వేపాడ సమీపం వరకు లెవెల్‌చేసి 11/400 కిలో మీటర్ రాయి నుంచి 16/380 కిలో మీటర్ వరకు తారురోడ్డు ఫస్ట్ లేయర్ పనులు ప్రారంభించామని చెప్పారు. వేపాడ, సోంపురం, అరిగిపాలెం గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడ్ కాలువలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే సుమారు 50 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలి



నరవగ్రామంలో గృహసారథులతో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

• గృహసారథులకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచన

గంట్యాడ: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా గృహ సారథులు పనిచేయాలని, పార్టీకి గృహసారథులే వి జయ సారథులని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అ ప్పలనరసయ్య అన్నారు. మండలంలోని కొఠారుబి ల్లి, నరవ, నందాం, నీలావతి తదితర గ్రామాల్లో గృహసారథులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధిని గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వివరించాలని అన్నారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని తెలిపారు. ఈనెల18వ తేదీ నుంచి 'మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని వారం రోజుల పాటు నిర్వహించనున్నామని, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కొఠారుబిల్లి, నరవ, నందాం, నీలావతి తదితర గ్రామాల పట్టభద్రులను ఎమ్మెల్యే కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగం అభివృద్ధికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్య, లానేస్తం, తదితర పథకాల ద్వారా ఎంతోమంది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోగలుగుతున్నారని అన్నారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, స చివాలయ కన్వీనర్లు, గృహసారథుల మండల కన్వీనర్ రామసూర్యం, నాయకులు లచ్చిరెడ్డి కృష్ణ, రంభ సత్యారావు, జాగరపు సత్యారావు, నారాయణ మూర్తి, పి.నారాయణమూర్తి, నరవ సర్పంచ్ పతివాడ భాస్కరరావు,ఎంపీటీసీ మోపాడ అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు బొండపల్లి మండలంలో...

బొండపల్లి: మండలంలోని బిల్లలవలస, కెరటాం, నెలివాడ, అంబటివలస, గొట్లాం, గరుడుబిల్లి, వేంద్రాం, ఒంపల్లి, కొండకిండాం, కిండాం అగ్రహారం గ్రామాల్లో గృహసారథులతో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య గురువారం సమావేశం కానున్నట్లు ఎంపీపీ చల్ల చలంనాయుడు బుధవారం తెలిపారు. అలాగే ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ,సర్పంచ్‌లు,ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

సమష్టి కృషితో సుధాకర్‌ను గెలిపిద్దాం

• ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు

కొత్తవలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేద్దామని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో గృహసారథులు,సచివాలయ కన్వీనర్లతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులను గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కలిసి ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించి, వారి మద్దతు కోరాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు చంద్రబాబు పాలనకు మధ్య వ్యత్యాసాన్ని పట్టభద్రులు బేరీజు వేసుకోవాలని సూచించారు. అనంతరం 'మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జేసీఎస్ ఇన్‌చార్జి బొంతల వెంకటరమణ, సర్పంచ్ విరోతి కొండలరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఐతంశెట్టి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గొల్లపేరంటాలమ్మ యాత్ర



గొల్లపేరంటాలమ్మవారు

చీపురుపల్లి రూరల్: మండలంలోని మెట్టపల్లి గొల్లపేరంటాల అమ్మవారి 48వ యాత్రోత్సవాలకు ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేసింది. గురువా రం నుంచి ఈనెల 5వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ మీసాల రమణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు, ఎంపీటీసీ మీసాల ఈశ్వరరావు, సర్పంచ్ బూటు పద్మ, నాయకులు శ్రీనివాసరావు, మీసాల పాపినాయుడు, మీసాల పైడితల్లి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. జాతరలో చీపురుపల్లి మండలంతో పాటు గరివిడి మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జాతర సందర్భంగా ఆలయ కమిటీ నాలుగు రోజులూ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. 2న సీతారామ కల్యాణం నాటకం, డాన్స్ బేబీడాన్స్, 3న రేలారే రేలా, 4న డీ–జోడీ, శ్రీదేవి డ్రామా కంపెనీ వారి మెగా డ్యాన్స్ హంగామా, 5న శ్రీ రామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర నాటకాలను ఏర్పాటు చేశారు.

3,4వ తేదీల్లో ఎడ్ల, గుర్రాల పరుగు ప్రదర్శన

వేపాడ: జాకేరు గ్రామంలో రామాలయ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయని సర్పంచ్ బుద్ధాచిన్నమ్మలు అప్పలనాయుడు దంపతులు బుధవారం తెలిపారు. తొలిరోజు ప్రత్యేక పూజలు, 3వ తేదీన సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే 3వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.25 వేలు, ద్వితీయ స్థానం రూ.20వేలు, తృతీయ స్థానం రూ.18వేలు, నాలుగో స్థానం రూ.15వేలు, అయిదో స్థానం రూ.10వేలు, ఆరోస్థానం రూ.9 వేలు,ఏడో స్థానం రూ.8 వేలు, ఎనిమిదో స్థానం రూ.7వేలు, తొమ్మిదో స్థానం రూ.6 వేలు, పదో స్థానం రూ.5 వేలు ఇలా మొదటి 14 స్థానాల్లో నిలిచిన ఎద్దులకు సంబంధించిన యజమానులకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం సాయింత్రం జబర్దస్త్ నటీనటుల సాంస్కృతిక కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్న 3 గంటలకు గుర్రాల పరుగు ప్రదర్శన నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

లక్కవరపుకోట: మండలంలోని సంతపేట గ్రామంలో రైతులకు నవధాన్యాల సాగుపై సబల సంస్థ కో–ఆర్డినేటర్ ఈశ్వరరావు బుధవారం అవగాహన కల్పించారు. తొలకరి పంట వేసే 45 నుంచి 55 రోజుల ముందు ఎకరానికి 12 నుంచి 18 రకాల నవధాన్యాల విత్తనాలు చల్లాలని సూచించారు. 45 రోజులకు చేను ఏపుగా పెరుగుతుందని, అప్పుడు దాన్ని కలియదున్నాలని చెప్పారు. ఇలా చేయడం వల్ల భూమిలో కర్బన్ శాతం, సూక్ష్మపోషకాలు వృద్ధి చెంది భూమి సారవంతమవుతుందని తెలిపారు. దీంతో ప్రధాన పంటకు ఎరువుల పెట్టుబడి తగ్గుతుందని, దిగుబడులు కూడా పెరుగుతాయన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

వేపాడ: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని ప్రకృతి వ్యవసాయ యాంకర్ సన్యాసమ్మ అన్నారు. కుమ్మపల్లి క్లస్టర్ పరిధి చినగుడిపాల గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంలో విత్తన శుద్ధి, వాటిని పొలాల్లో నాటే విధానం, తదితర అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు.

ఏపీజీఈఏ మహాసభను జయప్రదంచేయండి

జామి: జిల్లా కేంద్రం విజయనగరంలో గురువారం నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) కౌన్సిల్ మహాసభను ఉద్యోగులంతా జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కంది వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పోలీసు, విద్యాశాఖ, మండల పరిషత్ తదితర ఉద్యోగులను ఇప్పటికే కలిసి సభకు హాజరు కావాలని కోరామని తెలిపారు. సభకు ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ హాజరవుతారని పేర్కొన్నారు.

కోర్సు ఎంపికే కీలకం



గర్భాం మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ధీర ఫౌండేషన్ ప్రతినిధి నాగరాజు

మెరకముడిదాం: పదోతరగతి తర్వాత విద్యార్థులు ఇంటర్, ఇతర చదువులకు సంబంధించి కోర్సుల ఎంపికలో ఒకటికి పదిసార్లు ఆలోచించాలని, భవిష్యత్‌లో డిమాండ్ ఉండే కోర్సులను ఎంపిక చేసుకోవాలని విజయనగరానికి చెందిన ధీర ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ నాగరాజు తెలిపారు. ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గర్భాం, భైరిపురం ఉన్నత పాఠశాలలు, గర్భాం మోడల్‌స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నతవిద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మిల కుమారుడు సందీప్‌బాబు ధీర ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారని చెప్పారు. పేద విద్యార్థులకు ఉద్యోగాలకు అవసరమైన కోర్సులను ఉచితంగా ఇప్పిస్తున్నారని, ఉన్నత విద్య చదివేందుకు తమవంతు తోడ్పాటు అందిస్తున్నామని వివరించారు. ఎంఈఓ ఎం.రామారావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవం



కంటకాపల్లిలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీరాణి



దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: కంటకాపల్లి గ్రామంలో మదిన వారి కల్లాల సమీపంలో దుర్గమ్మ ఆలయ ప్రతిష్ఠోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మదిన లక్ష్మి, అప్పలరమణ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కడబండి శ్రీనివాసరావు, విజయనగరం మాజీ ఎంపీ బొత్స ఝాన్సీరాణి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, ఎంపీపీ నీలంశెట్టి గోపె మ్మ, జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద మధ్యా హ్నం 5వేల మందికి అన్నదానం చేశారు.

ముగిసిన ఉత్సవాలు

కొత్తవలసలోని కుమ్మరిబంజరి సమీపంలోని గరుడాద్రి కొండపై కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాల్లో బుధవారం ముగిశాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ఆఖరి రోజు దేవతామూర్తుల విగ్రహాలను వేదపండితులు ప్రతిష్ఠించారు.

చలివేంద్రాల ప్రారంభం



గజపతినగరం: మండల కేంద్రంలో చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు



గజపతినగరం: పురిటిపెంటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



వేపాడ: బల్లంకిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి

గజపతినగరం: వేసవి నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఇన్‌చార్జిఎంపీడీఓ పప్పు సుదర్శనం తెలిపారు. మండల అధికారుల ఆదేశాల మేరకు పురిటిపెంటలో ఆ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ శొంఠ్యాన విజయలక్ష్మి, వైస్ సర్పంచ్ మండల సురేష్, గజపతినగరం పంచాయతీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిలో స్థానిక వినాయక టెంపుల్ వద్ద చలివేంద్రాన్ని సర్పంచ్ నరవ కొండమ్మ,వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు బుధవారం ప్రారంభించారు. తొలిరోజు పాదచారులు, ప్రయాణి కులకు మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, పంచాయతీ కార్యదర్శులు జనార్దన రావు, రమణ, సచివా లయాల సిబ్బంది, సీనియర్ నేతలు కర్రి నానాజీ, బోని శ్రీను పాల్గొన్నారు.

బల్లంకిలో..

వేపాడ: అధికారుల ఆదేశాల మేరకు బల్లంకి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి అలుగోజు నారాయణమూర్తి బుధవారం ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తవలస: జీడి మామిడి తోటలో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు వస్తాయని గుంటూరు జీడి పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త కె.ఉమా మహేశ్వరరావు అన్నారు. మండలంలోని సంతపాలెం గ్రామంలో జీడి రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. జీడి పంటను ఆశించే తెగుళ్లు, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలను వివరించారు. కీటక శాస్త్రవేత్త బి.నాగేంద్రరెడ్డి మాట్లాడుతూ జీడి పంటను ఈ ఏడాది టీదోమ ఆశించడం వల్ల కొంత వరకు పూత రాలిపోయిందన్నారు. పూతతో ఉన్న చెట్లకు లాండసైహాలోత్రిన్ 0.5 మిల్లీ లీటర్ల మందుతో పాటు గ్రాము కార్బెండిజమ్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. జీడి చెట్ల కొమ్మలు కత్తిరింపు, సస్యరక్షణ చర్యలను ఉద్యానవన సహాయ సంచాలకులు శైలజ వివరించారు. ఉద్యానవనశాఖ అధికారి ఉమాభరణి తదితరులు పాల్గొన్నారు.

ఠంచన్‌గా పింఛన్

ప్రతీ నెల మాదిరిగానే సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు పింఛన్ డబ్బులను ఈనెల కూడా ఒకటో తేదీన వలంటీర్లు అందజేశారు. మార్చి నెలకు సంబంధించిన పింఛన్ల పంపిణీని బుధవారం తెలతెలవారుతుండగానే వలంటీర్లు ప్రారంభించారు. ఆరోగ్యసమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు పింఛన్‌దారుల వద్దకు వలంటీర్లు వెళ్లి పింఛన్ అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్



గజపతినగరం: పురిటిపెంట పాత రోడ్డులో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బేగమ్



దత్తిరాజేరు: పాచలవలసలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్, స్థానిక నాయకుడు



గజపతినగరం రూరల్: ఎం.కొత్తవలసలో వృద్ధురాలు అప్పయ్యమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్



గజపతినగరం రూరల్: కాలంరాజుపేటలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్, స్థానిక సర్పంచ్ ఈశ్వరరావు



దత్తిరాజేరు: విజయనగరం సర్వజన ఆస్పత్రిలో వంగర గ్రామానికి చెందిన చిట్టమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రవి



కొత్తవలస : గుండె సంబంధిత వ్యాధితో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దేశపాత్రునిపాలెంకు చెందిన అమ్మాజీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కృష్ణ



దత్తిరాజేరు: విజయనగరంలోని ఆస్పత్రిలో చౌదంతివలసకు చెందిన వృద్ధుడు కడియాల చిన్నయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సురేష్



వేపాడ: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బానాదికి చెందిన వృద్ధుడు దుర్గకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సాయికుమార్